సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



రైతన్నకు రుణ సాయం

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోంది. వంటల సాగుకు విరివిగా రుణాలు అందజేస్తోంది. - 8లో



పులి కలకలం

వేపాడ మండలం ఎస్.కోట సీతారాంపురం సమీపంలో పులి సంచారం అలజడి రేపుతోంది. - 8లో



చెట్ల నరికివేతపై న్యాయమూర్తి కన్నెర్ర

చెట్ల అక్రమ నరికివేతపై ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన ప్రీ లిటిగేషన్ కేసును న్యాయమూర్తి ఎస్.వాణి శనివారం విచారణ జరిపారు. - 8లో

న్యూస్‌రీల్

చిరుధాన్యాలతో ఆరోగ్యం

- డీఈఓ ప్రేమ్‌కుమార్



వి.పూజిత

పార్వతీపురంటౌన్: చిరుధాన్యాలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని డీఈఓ ప్రేమ్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియం (బెంగళూరు) సంయుక్తంగా జిల్లాస్థాయి సెమినార్‌ను పార్వతీపురం డీవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించాయి. 'చిరుధాన్యాలు ఒక మంచి పోషకాహారం లేదా ఒక వ్యామోహం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో మక్కువ మండలం మునక్కాయవలస ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన వి. పూజిత ప్రథమస్థానంలో నిలిచింది. ఈ నెల 25వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ చిరుధాన్యాల ఆవశ్యకతను గుర్తించేందుకు సెమినార్‌లు దోహదపడతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపాలని పూజితను జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎంఈఓ-1 వై.విమలకుమారి, ఎంఈఓ-2 కె.ప్రసాద్, జిల్లా ఆప్కాస్ట్ కో ఆర్డినేటర్ పి. రామకృష్ణ, డీవీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



చినబోగిలిలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

సీతానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. సీతానగరం మండలం చినబోగిలిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైనవారికి గ్రామాల్లోనే ఆరోగ్యశిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు సిఫార్సుచేయడమే సర్వే ప్రధాన ఉద్దేశమన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, వార్డు వలంటీరు, ఏఎన్‌ఎమ్, ఆశ కార్యకర్తలు, సీహెచ్‌ఓలు బృందాలుగా ఏర్పడి ఆరోగ్య సర్వే పూర్తిచేయాలన్నారు. ఇంటివద్దనే బీపీ, మధుమేహం, రక్తహీనత, మూత్రం, మలేరియా, డెంగీ, కఫం పరీక్షలు చేయాలన్నారు. అవసరమైన వారికి ఈ నెల 30 నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న వైద్య శిబిరాలకు ఓపీ చీటీలను అందించాలన్నారు. వైద్య శిబిరం తేదీ, సమయం, వైద్య నిపుణుల వివరాలు, ఉచిత పరీక్షలు గురించి పూర్తి సమాచారం చీటీలో ఉండాలన్నారు. ఆరోగ్య శిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఒక స్పెషలిస్టు డాక్టర్ హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి జగన్నాథరావు, తహసీల్దార్ ఎస్.వి.రమణ, ఎంపీడీఓ ఎం.ఎల్.ఎన్.ప్రసాద్, సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్లు, సర్పంచ్ కె.రాధ, ఎంపీటీసీ జి.బుజ్జి, సిబ్బంది పాల్గొన్నారు.

30లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉందని బాలుర కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించిన విద్యార్థులు 2024 మార్చిలో జరగనున్న పరీక్షలు రాసేందుకు అర్హులని పేర్కొన్నారు.

సులభంగా స్త్రీనిధి చెల్లింపులు



పొదుపు మహిళలకు పేటీఎం విధానంపై అవగాహన కల్పిస్తున్న వైకేపీ సిబ్బంది

- పేటీఎం మెషీన్ ద్వారా లావాదేవీలు
- రుణ వాయిదాల చెల్లింపులో పారదర్శకత
- లావాదేవీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో పాలకొండ
- జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలుకు చర్యలు

జిల్లాలో స్త్రీనిధి రుణ వివరాలు ఇలా..

స్త్రీ నిధి రుణం పొందిన సభ్యుల సంఖ్య	34,360
రుణం పొందిన గ్రూపులు	8,154
రుణ మొత్తం	రూ.143.56 కోట్లు
గ్రామ సమాఖ్యల సంఖ్య	382
నూతన విధానంలో రికవరీ శాతం	91.75

పాలకొండ రూరల్: మహిళాభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. స్వయం సహాయక సంఘాలకు అవసరమైన తోడ్పాటునందిస్తోంది. సకాలంలో రుణాలు అందించడంతో పాటు సక్రమంగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీ కల్పిస్తోంది. ఇందులో భాగంగా మరో ముందడుగు వేసి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న అక్కచెల్లెమ్మలు తిరిగి రుణాల చెల్లింపును మరింత సులభతరం చేసింది. పేటీఎం మెషీన్ ద్వారా వాయిదాలను డిజిటల్ విధానంలో చెల్లింపునకు అవకాశం కల్పించింది.

జిల్లాలో పాలకొండ, కురుపాం, పార్వతీపురం, సాలూరు క్లస్టర్ల పరిధిలో నూతన విధానం ద్వారా చెల్లింపుల స్వీకరణ సాగుతోంది. స్త్రీనిధి లావాదేవీల నిర్వహణలో పాలకొండ క్లస్టర్ జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. సాంకేతికతతో ముడిపడి ఉన్న ఈ విధానంలో సమస్యలు అధిగమించి ఏజెన్సీ గ్రామల్లో నూతన విధానం అమలుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ డిజిటల్ పేమెంట్ల ద్వారా అవకతవకలకు తావుండదని అధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇలా..

స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి గరిష్ఠంగా రూ.లక్ష వరకు స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. వీరు సమాన వాయిదాల్లో రుణం చెల్లించాల్సి ఉంటుంది. రుణం తీసుకున్న సభ్యులు వాయిదా మొత్తాన్ని సంఘ అధ్యక్షురాలికి అక్కడి నుంచి గ్రామ సమాఖ్య సంఘానికి అందించాలి. గ్రామ సమఖ్య ఖాతా నుంచి గ్రామ సంఘం అధ్యక్షుల ద్వారా వీఓఏ స్త్రీనిధి ఖాతాకు వాయిదా మొత్తాన్ని జమ చేసేవారు. ఈ విధానంలో సమయం వృథా, నిర్ణీత సమయంలో చెల్లించకపోతే వడ్డీ భారం పడేది. వీటన్నింటికీ స్వస్తి చెబుతూ ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. పేటీఎం మెషీన్ ద్వారా వాయిదాల సొమ్మును క్షణాల్లో చెల్లించడంతో పాటు రశీదును కూడా పొందవచ్చు. చెల్లించిన మొత్తం, చెల్లించాల్సిన రుణం వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. నూతన విధానంలో స్త్రీనిధి మహిళా బ్యాంకు ప్రతి గ్రామ సమాఖ్య సంఘానికి పేటీఎం మెషీన్‌ను అందిస్తోంది. గ్రామ సమాఖ్య సంఘం నియమించిన వీఓఏ లాగిన్ ద్వారా ఈ మెషీన్‌ను నిర్వహిస్తారు.

ఉపయోగించే విధానం ఇలా..

- పేటీఎం మెషీన్‌ను వీఓఏ మొబైల్ నంబర్‌తో లాగిన్ కావాలి.
- పేమెంట్ చేసేందుకు స్వయం సహాయక సంఘం (ఎస్‌హెచ్) ఐడీ నమోదు చేయాలి.
- తర్వాత ఆ సంఘంలో స్త్రీనిధి రుణం తీసుకున్న సభ్యుల పేర్లు కనిపిస్తాయి.
- ఏ సభ్యురాలి వాయిదా చెల్లించాలో నమోదు చేయాలి.
- సభ్యురాలి డిమాండ్ మొత్తం, క్లోజర్ ఔట్ స్టాండింగ్ చూపిస్తుంది.
- వాయిదా మొత్తాన్ని నమోదు చేయాలి.
- ఎంత మంది సభ్యులు పేమెంట్ చేస్తారో వారి రికవరీ మొత్తాలను నమోదు చేయాలి.
- నమోదు చేసిన మొత్తం, రికవరీ మొత్తాన్ని సరిచూసుకోవాలి.
- వాయిదాను ఏ రూపంలో చెల్లిస్తామో ఎంపిక చేసుకోవాలి.
- రూపే కార్డు, స్కాన్ క్యూఆర్ కోడ్ (యూపీఐ పేమెంట్) సెలెక్ట్ చేసి చెల్లింపులు జరపాలి.
- కంప్లీట్ ఆర్డర్స్ చేసి ప్రింట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
- అనంతరం వచ్చే ప్రింట్ రశీదును సభ్యులకు అందజేయాలి.

సమయం వృథాకాదు



గతంలో స్త్రీనిధి రుణం చెల్లింపులకు గ్రామ సమాఖ్య ద్వారా బ్యాంకుకు వెళ్లి నగదు జమ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. పేటీఎం ద్వారా చెల్లింపులు చేపట్టవచ్చు. సమయం వృథా కాదు. చెల్లింపులకు సంబంధించిన రశీదు తక్షణమే అందుతుంది. లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయి. పేమెంట్ వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. పాలకొండ క్లస్టర్‌లో 1167 సంఘాలు ఉన్నాయి. వీటిలో 13,357 మంది సభ్యు ఉన్నారు. ఈ ఏడాది స్త్రీ నిధి రుణ లక్ష్యం రూ.6 కోట్లు. ఇప్పటి వరకు 436 మందికి రూ.2 కోట్ల 42 లక్షలు అందించాం. నూతన విధానంలో 97.35 శాతం (రూ.2కోట్ల పైబడి) రికవరీ అయింది.

- వి.లక్ష్మణరావు, స్త్రీనిధి, మేనేజర్ పాలకొండ క్లస్టర్

అవకతవకలకు చోటులేకుండా...



స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను తిరిగి వాయిదాల రూపంలో చెల్లించేందుకు నూతనంగా ప్రవేశపెట్టిన పేటీఎం మెషీన్ ద్వారా లావాదేవీలు పారదర్శకంగా జరుగుతాయి. ఎటువంటి అవకతవకలకు చోటు ఉండదు. జిల్లావ్యాప్తంగా అమలుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు క్లస్టర్ల పరిధిలో మండలాల్లో నూతన విధానం అమలు చేస్తున్నాం. ఏజెన్సీ గ్రామాల్లో సాంకేతిక సమస్యలు అధిగమించేలా కార్యాచరణ చేపడుతున్నాం. త్వరలో అన్ని మండలాల్లో పేటీఎం ద్వారా చెల్లింపులు జరిగేలా చూస్తాం. మా సిబ్బంది అందుకుతగ్గట్లు సంఘాలను, క్షేత్రస్థాయి సిబ్బందిని సిద్ధం చేస్తున్నారు.

- పి.కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

● నైవేద్యం సమర్పయామి..!



కురుపాం మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో సాగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆరవరోజు పంచముఖ విఘ్నేశ్వరునికి 108 రకాల ప్రసాదాలను భక్తులు నైవేద్యంగా సమర్పించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

- కురుపాం

కమనీయం.. వేంకటేశుని కల్యాణం

- శాస్త్రోక్తంగా నిర్వహించిన అర్చకస్వాములు
- స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



వేంకటేశ్వర స్వామి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామ స్వామివారి సన్నిధిలో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం శనివారం సాయంత్రం కనులపండువగా సాగింది. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, బాలభోగం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. తరువాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించి స్వామివారిని రామతీర్థం తిరువీధుల్లో పల్లకిలో ఊరేగించారు. అర్చకస్వాములు గ్రామ అష్ట దిక్కులకు స్వామివారిని తీసుకువెళ్లి గ్రామ బలిహరణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారిని ఆస్థాన మండపంలోకి తీసుకువచ్చి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం (స్థల, దేహ శుద్ధి) తదితర పూజలు చేశారు. అనంతరం నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు రామక్షేత్రానికి విచ్చేసి తిరుపతి నుంచి వచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం 4 గంటలకు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా స్వామివారి కల్యాణాన్ని అర్చకులు జరిపించారు.

26న స్వామివారికి చక్రస్నానం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న స్వామివారికి చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ధ్వజస్తంభంపై ఎగురవేసిన గరుత్మంతుడి చిత్రపటాన్నికిందకు దింపి బ్రహ్మోత్సవాలను పూర్తిచేయనున్నారు.



మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

చక్కని బోధనతో ఉత్తమ ఫలితాలు

- ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: నూతన విద్యావిధానంలో ప్రమాణాలతో కూడిన బోధన వల్ల ఉత్తమ ఫలితాలు సాధించగలమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమపాఠశాలలో కోర్సు డైరెక్టర్, డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. తొలిరోజు ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, గురుకులాల ప్రిన్సిపాళ్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పీఓ మాట్లాడారు. ప్రతిఒక్కరూ గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో పక్కాగా అమలు చేయాలన్నారు. మొదట గిరిజన సంక్షేమశాఖ డీడీ మంగవేణి జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమం ప్రారంభించగా, వమ్మరవిల్లి డైట్ ప్రిన్సిపాల్ తిరుమల చైతన్య పాఠశాలనిర్వహణ, తల్లిదండ్రులపాత్ర, శాలసిద్ధిని వివరించారు. హెల్త్ అండ్ హైజీన్‌పై ఏరియా ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి శ్రీనివాసరావు, యాప్స్ వినియోగంపై లాబర హెచ్‌ఎం సూర్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ నిర్వహణపై ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్‌దయానంద్ సూచనలిచ్చారు. కెరీర్ గైడెన్స్‌పై ప్రసాద్, లీడర్‌షిప్, ల్యాబ్‌ల నిర్వహణపై హెచ్‌ఎం హేమసుందర్, ఒత్తిడి నిర్వహణ, యోగాపై జానార్ధన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంఆర్‌సీ స్టాఫ్ ఏఎంఓ కోటిబాబు, జీసీడీఓ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలే కొలమానం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం:పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పుల ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా జరగాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో శనివారం సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల అవసరాలను అన్ని కోణాల్లో పరిశీలించి ప్రతిపాదించాలన్నారు. ఈవీఎంల అవసరాలు, భద్రత, రవాణా, అవసరమైన సిబ్బంది, గ్రామాల మధ్య దూరం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఒక గ్రామానికి చెందిన ఓటర్లు అదే గ్రామంలో ఓటువేసే అవకాశం ఉండాలన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్వో జె.వెంకటరావు, హెచ్-సెక్షన్ పర్యవేక్షకులు డి.రవికుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రెడ్డి వేణు, గొట్టాపు వెంకటనాయుడు, పైల శ్రీనివాసరావు, ఎం.గౌరీశంకరరావు, ఇ.వెంకటనాయుడు పాల్గొన్నారు.

27న గిరిజన సాధికారతపై అవగాహన సదస్సు

పార్వతీపురం: స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో ఈ నెల 27న 'షెడ్యూల్ గిరిజన (ఎస్టీ) సాధికారత, అత్యాచారాల నియంత్రణ' అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ) విశాఖప్రాంతీయ కార్యాలయం డీఎస్పీ ఎం.ఎస్.భూపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, కలెక్టర్ నిషాంత్ కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, పీఓ విష్ణుచరణ్ పాల్గొంటారన్నారు.

క్లుప్తంగా

200 మందికి భోజనం..



భోజనం పంపిణీ చేస్తున్న జ్యోతి, కిషోర్

విజయనగరం ఫోర్ట్: ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవం పురస్కరించుకుని సెయింట్ ఆన్స్ గర్ల్స్ ఆఫ్ ఫార్మసీ ఇన్‌చార్జి జ్యోతి, ప్రిన్సిపాల్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 200 మందికి శనివారం భోజనం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జ్ఞానమ్మ కమిటీ సభ్యులు మాధురి, నీలిమ, డైసీ, కీర్తన, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

బధిరులకు టీ షర్టుల పంపిణీ



బధిరులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: అంతర్జాతీయ సౌంజ్ఞ భాషా దినోత్సవం సందర్భంగా బధిరులకు ప్రత్యేక టీషర్టులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర్‌కౌశిక్ అందజేశారు. జిల్లా కేంద్రంలోని కోలగట్ల నివాసంలో సుమారు 300 మంది బధిరులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో బధిరులకు టీ షర్టులతో పాటు మధ్యాహ్న భోజనం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే నిమజ్జనం

భోగాపురం: వినాయక విగ్రహాలను నిబంధనల మేరకే నిమజ్జనం చేయాలని ఎస్సై ఎస్.కృష్ణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల అదేశాల మేరకు నిమజ్జన కార్యక్రమాల్లో పార్టీ జెండాలు గానీ, పార్టీ పాటలు గాని ప్రదర్శించడానికి వీల్లేదని పేర్కొన్నారు. అంతేకాకుండా డీజేలు గానీ, అత్యధిక శబ్ద కాలుష్యాన్నిచ్చే సౌండ్ బాక్సులు వినియోగించరాదన్నారు. ఏ చిన్నపాటి సంఘటనలు చోటుచేసుకున్నా కమిటీ సభ్యులదే బాధ్యతన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై సైకిల్ ర్యాలీ



రెడ్‌క్రాస్ సభ్యుల సైకిల్ ర్యాలీ

విజయనగరం: ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రెడ్‌క్రాస్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ కాంప్లెక్స్, కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం మీదుగా కలెక్టరేట్ వరకు సాగింది. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మాజీ మేనేజింగ్ కమిటీ సభ్యులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం



మెయిన్ రోడ్డులో కురుస్తున్న వర్షం

విజయనగరం: జిల్లా కేంద్రంలో శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన వర్షం గంటపాటు ఏకధాటిగా కురిసింది. ఇదే సమయంలో భారీ శబ్దాలతో పిడుగులు పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇదిలా ఉండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయం కాగా... వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారంతా ఇబ్బంది పడ్డారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు



మాట్లాడుతున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ అంబళ్ల సుధారాణి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఆయా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేయాల్సిన కార్యక్రమాల వివరాలను సిబ్బంది అందుబాటులో ఉంచుకోవాలని కోరారు.

రైతన్నకు రుణ సాయం

రైతే రాజు అన్న నానుడిని నిజం చేసేలా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలబడుతోంది. పంట సాగు పెట్టుబడి నుంచి దిగుబడుల కొనుగోలు వరకు అన్నింటా అండగా ఉంటూ రైతు సంక్షేమానికి సాయం అందిస్తోంది. ప్రభుత్వ సాయంతో పాటు రుణం కావాలనుకున్న రైతులకు ఆ సాయం కూడా అందేలా చర్యలు చేపడుతూ రైతుల మన్ననలు అందుకుంటోంది. దీంతో వ్యవసాయం పండగలా మారింది.

- ఖరీఫ్‌లో రుణాలు ఇచ్చింది రూ.1517 కోట్లు
- టెర్మ్ లోన్స్ రూ.1207 కోట్లు
- రబీ లక్ష్యం రూ.1410 కోట్లు



వరి పంటలో ఎరువు వేస్తున్న రైతు

విజయనగరం ఫోర్ట్: రైతు సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతుంది. విత్తు దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు అన్నింటా సహాయాన్ని అందిస్తోంది. పంట సాగు పెట్టుబడి కోసం రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా రూ.13,500 సాయాన్ని అందిస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతు మంగిటకే చేరుస్తోంది. రైతు పండించిన పంటను కూడా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పిస్తోంది. రైతులకు అవసరమైన పంట రుణాలను కూడా ప్రభుత్వం అందించి రుణ సాయాన్ని చేస్తోంది.

ఖరీఫ్‌లో రూ.1517 కోట్ల రుణాలు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులకు కోట్లాది రుపాయిల పంట రుణాలు అందించారు. టెర్మ్ రుణాలు కూడా ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ పంట రుణాల లక్ష్యం రూ.2025 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.1517 కోట్లు రుణాలు ఇచ్చారు. 1,22,000 మందికి పంట రుణాలు ఇచ్చారు. టెర్మ్ లోన్లకు సంబంధించి లక్ష్యం రూ.1363 కోట్లు కాగా ఇంతవరకు రూ.1207 కోట్ల రుణాలు అందించారు. 44,650 మందికి రుణాలు ఇచ్చారు. లక్ష్య సాధనకు ఇంకా సమయం ఉండడంతో పూర్తి స్థాయిలో రైతులకు రుణాలు అందించే అవకాశం ఉంది. గత ఏడాది ఖరీఫ్‌లో రుణ లక్ష్యం రూ.1806 కోట్లు కాగా రూ. 2016 కోట్లు రుణాలు అందించారు.

కౌలు రైతులకూ..

ప్రభుత్వం సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు రుణాలను అందిస్తోంది. రైతులకు ఎటువంటి ప్రయోజనాలు వర్తింపజేస్తోందో అదే స్థాయిలో కౌలు రైతులకూ వర్తింపజేస్తోంది. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపజేస్తుంది. వారికి కూడా విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. భూ యాజమానులకు ఇబ్బంది లేకుండా పంట రుణాలను కూడా అందిస్తోంది. ఈ ఏడాది 598 మంది రైతులకు రూ.1.81 కోట్ల రుణాలను అందించారు.

రబీ లక్ష్యం రూ.1410 కోట్లు

ఖరీఫ్ సీజన్ సెప్టెంబర్ నెలఖారుతో ముగుస్తుంది. అక్టోబర్ నెల నుంచి రబీ సీజన్ ప్రారంభం అవుతుంది. అక్టోబర్ నెల నుంచి రబీ సీజన్‌కు సంబంధించి పంట రుణాలను రైతులకు అందిస్తారు. రబీ సీజన్‌లో రూ.1410 కోట్ల రుణాలను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అందరికీ రుణాలు

రైతులందరికీ పంట రుణాలను అందిస్తున్నాం. సాధారణ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాం. ఇప్పటి వరకు రుణాలు పొందని వారు కూడా పొందే విధంగా వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. – వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

‘జగనన్న ఆరోగ్య సురక్ష’లో 500 వైద్య శిబిరాలు

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ చూపిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 482 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, 18 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 500 వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. శనివారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సెప్టెంబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటారని తెలిపారు. 18 ఏళ్ల పైబడిన వారిందరికి బీపీ, సుగర్, హెచ్‌బీ పరీక్షలు, పదేళ్లు పైబడిన వారికి హెచ్‌బీ పరీక్ష చేస్తారని తెలిపారు. పరీక్షల వివరాలను ఏఎన్‌ఎం ఏపీసేవ పోర్టల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారని చెప్పారు. శిబిరం ముందు రోజు గుర్తించిన వారి ఇంటికి ఒకటి చొప్పున టోకెన్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి ఫేజ్‌లో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురించి వివరిస్తారని అన్నారు. రెండో ఫేజ్‌లో సీహెచ్‌ఓ, ఏఎన్‌ఎంలు ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే చేస్తారని తెలిపారు. ఫేజ్–3లో వలంటీర్లు, ప్రజాప్రతినిధులు వైద్య శిబిరం నిర్వహించడానికి మూడు రోజులు ముందు వైద్య శిబిరం ఫలానా చోట నిర్వహిస్తారని ఇంటింటికి వెళ్లి చెబుతారని తెలిపారు. ఫేజ్–4 లో వైద్య శిబిరం నిర్వహించి, వైద్య పరీక్షలు చేసి అవసరమైన చికిత్స, మందులు అందజేస్తారని, ఫేజ్– 5 లో జిల్లాలో వైద్యం అందించలేని వారి వివరాలు సేకరించి వారికి ఎక్కడైతే సేవలు అందుతాయో ఆయా ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు లక్ష ఇళ్లను సందర్శించి, 2.50 లక్షల మంది ప్రజలను సర్వే చేయడం జరిగిందని తెలిపారు.

రక్త నిల్వలను పెంచాలి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని రక్త నిధి కేంద్రాల్లో రక్త నిల్వలను పెంచాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో సేవాపక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నిల్వల సంఖ్యను పెంచడం కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతుందని తెలిపారు. రక్తదానం సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. రక్తదాతలే ప్రాణదాతలని తెలిపారు. మనిషి మాత్రమే రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న సాటి మనిషిని కాపాడగలడని పేర్కొన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఏడాదికి నాలుగు పర్యాయాలు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఐసీ సాక్షి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గొడౌన్ల తనిఖీ

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని రెండు ఈవీఎం గోదాములను కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. గోదాముల్లో నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన గదులను, వాటికి వేసిన సీళ్లను పరిశీలించారు. రెండు గోదాముల్లోని సీసీ కెమేరాలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని ఆదేశించారు. గోదాముల్లోని అనవసర వస్తువులను తక్షణమే అక్కడినుంచి తీసివేయాలని సూచించారు. ఖాళీ గదులన్నింటినీ శుభ్రంచేసి, వినియోగానికి సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తనిఖీల్లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత, ఆర్‌డీఓ ఎం.వి సూర్యకళ, ఎన్నికల విభాగం సూపరింటిండెంట్ దేవ్‌ప్రసాద్, నెల్లిమర్ల తహసీల్దార్ డి. ధర్మరాజు, డీటీ శైలజ, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ



విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్

గజపతినగరం : గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామని బొబ్బిలి డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. గజపతినగరం సర్కిల్ ఆఫీస్ కార్యాలయాన్ని శనివారం ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణ చేసిన వారితో పాటు గంజాయిని సేవించిన వారి సమాచారాన్ని ప్రజలు అందించాలని ఆయన కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కూడా నిఘా పెట్టామన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బొండపల్లి మండలం గురుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడడంతో శనివారం గజపతినగరంలో ఆయనను అదుపులోకి తీసుకొని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు. ఆయన వెంట సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ గంగరాజు ఉన్నారు.

5కే రన్‌లో సత్తా చాటిన అథ్లెట్



నగదు బహుమతి అందుకుంటున్న గోవర్ధనరావు

వంగర: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన యూత్‌ఫెస్ట్ 5కే మారథాన్‌లో వంగర మండలం మద్దువలస పంచాయితీ జగన్నాధవలస గ్రామానికి చెందిన అథ్లెట్ నాచు గోవర్ధనరావు సత్తా చాటాడు. జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచి నగదు బహుమతిని జిల్లా క్రీడల అధికారి శ్రీధర్ నుంచి అందుకున్నారు. అథ్లెట్ గోవర్ధనరావును పలువురు అభినందించారు.

పులి కలకలం



ఎస్.కోట సీతారాంపురంలో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖాధికారులు

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీ శివారు ఎస్.కోట సీతారాంపురం సమీపంలో శుక్రవారం రాత్రి పులి సంచరించినట్లు పాదముద్రలు వుండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇందుకు సంబంధించి డీఆర్‌ఓ రవికుమార్, స్థానికులు అందించిన వివరాలు... ఎస్.కోట సీతారాంపురం గ్రామానికి చెందిన పరవాడ దాలినాయుడు శనివారం ఉదయం కల్లంలోకి వెళ్లేసరికి ఆవుదూడ కనిపించకపోవటంతో పరిసరాల్లో వెతికారు. ఆవు దూడ ఆచూకీ దొరక్కపోగా... పులి పాదముద్రలు చూసిన స్థానికులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో డీఆర్‌ఓ రవికుమార్, వెంకయ్యపాలెం బీట్ ఆఫీసర్లు సూర్యనారాయణ, పూజ తదితర సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. తమ పరిశీలనలో పులి పాదముద్రలు గుర్తించామని పులి అనంతగిరి కొండల వైపు వెళ్లినట్లు పాదముద్రలు చూసి గుర్తించినట్లు డీఆర్‌ఓ తెలిపారు. ఉదయం 10 గంటల వరకు బయటకు వెళ్లవద్దని, సాయంత్రం 4 గంటలకే ఇళ్లకు చేరుకోవాలని ప్రజలను చైతన్యపరిచినట్లు చెప్పారు.

వాలీబాల్ పోటీలకు స్పందన



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

విజయనగరం: రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు శనివారం నిర్వహించిన వాలీబాల్ పోటీలకు స్పందన లభించింది. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువజన మాసోత్సవాల్లో భాగంగా స్థానిక రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన పోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన 40 జట్లు పాల్గొన్నాయి. వీరికి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధి టీవీ భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఉత్సుకత చూపించారు. విజేతలకు వచ్చే నెల 2న నిర్వహించనున్న యువజన మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉడత్తు రాజేష్, అరుణ్ సోడాని తెలిపారు. అదేవిధంగా ఈనెల 24వ తేదీ సాయంత్రం వాయిస్ ఆఫ్ విజయనగరం ఫైనల్స్, 26న బ్రైడ్స్ ఆఫ్ ఇండియా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు క్లబ్ ప్రతినిధులు, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై న్యాయమూర్తి కన్నెర్ర



కేసు విచారిస్తున్న ఎస్.కోట న్యాయమూర్తి ఎస్.వాణి

- ప్రీలిటిగేషన్ కేసుపై విచారణ

శృంగవరపుకోట: చెట్ల అక్రమ నరికివేతపై స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో దాఖలైన ప్రీలిటిగేషన్ కేసును న్యాయమూర్తి ఎస్.వాణి శనివారం విచారించారు. ఈ సందర్భంగా చట్టాలను పట్టించుకోకుండా భారీ చెట్లు నరికేస్తుంటే ప్రభుత్వ శాఖల అధికారులు ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించారు. తక్షణం అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి పూర్తి స్థాయి అనుమతులు లేకుండా చెట్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ డి.శ్రీనివాసరావును ఆదేశించారు. పర్యావరణ వేత్త బి.రామకృష్ణ పట్టణంలో పలు భారీ వృక్షాలను అనుమతులు లేకుండా అక్రమంగా నరికేస్తున్నారంటూ తహసీల్దార్, ఆర్అండ్‌బీ ఏఈ, విద్యుత్‌శాఖ ఏఈ, పంచాయతీ ఈఓ తదితరులపై ప్రీలిటిగేషన్ కేసు నమోదు చేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయమూర్తి వాణి ప్రీలిటిగేషన్ కేసులో దీన్ని పరిష్కరించలేమని, ప్రత్యేక కేసు దాఖలు చేయాలన్నారు. పర్యావరణ రక్షణ కోసం చెట్ల నరికివేతను అడ్డుకోవాల్సిన సంబంధిత శాఖల అధికారులు చట్టాల అమల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని ఫిర్యాదుదారు, న్యాయవాది బి.రామకృష్ణ కోరారు. మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకుంటామని అధికారులు న్యాయమూర్తి సమక్షంలో అంగీకరించారు. విచారణకు హాజరుకాని విద్యుత్ శాఖ ఏఈ, పంచాయతీ ఈఓలకు నోటీసులు జారీ చేసి కేసును వాయిదా వేశారు.